క్లుప్తంగా

నేడు దుగ్గిరాలలో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ'

దుగ్గిరాల: బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం ఆదివారం సాయంత్రం 4 గంటలకు దుగ్గిరాల గ్రామం రైలుపేటలోని డాక్టర్ కళ్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తాడిబోయిన శివగోపయ్య తెలిపారు. శనివారం దుగ్గిరాల పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. శాసన మండలి సభ్యులు మురుగుడు హనుమంతరావు, పార్టీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పాల్గొంటారని తెలిపారు. దుగ్గిరాల మండల జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొని కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు.

ఏపీ రైతు సంఘం కుంచనపల్లి గ్రామ కమిటీ ఎంపిక



తాడేపల్లి రూరల్: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కుంచనపల్లి గ్రామ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ కుంచపల్లి రైతు సంఘం అధ్యక్షుడిగా కాజా పెద్ద వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా అమ్మిశెట్టి రంగారావులను ఎన్నుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా వారిని అభినందించి, రైతు సమస్యలపై పోరాడాలని వారిని కోరారు. రైతు నాయకులు దొంతిరెడ్డి వెంకట రెడ్డి, కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు పల్లెకృష్ణ, అమ్మిశెట్టి సుబ్బారావు, ఆదియ్య, శ్రీనివాసరావు, అమర ఉమామహేశ్వరరావు, నున్న నాగేశ్వరరావు, కాట్రగడ్డ సత్యనారాయణ, కాజా సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలను విజయవంతం చేయాలి

మంగళగిరి: సీపీఐ మండల మహాసభలను విజయవంతం చేసేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. మంగళగిరి మండలంలోని ఆత్మకూరు గ్రామంలో శనివారం నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఈ నెల 14 తేదీన జరిగే మండల మహాసభకు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలపై పన్నులు భారం మోపడంతోనే కాలయాపన చేస్తుందన్నారు. పార్టీ నాయకులు చిన్ని తిరుపతయ్య, జాలాది జాన్ బాబు, జాలాది విజయేంద్రరావు, వెంగళ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



తెనాలిరూరల్: రైల్లో నుంచి జారిపడి గాయాలపాలైన గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పొన్నూరు మండలం ఆలూరులోని లెవల్ క్రాసింగ్ గేటు వద్ద శుక్రవారం రాత్రి సుమారు 50 నుంచి 55 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి రైల్లో నుంచి జారి పడి గాయాలపాలయ్యాడు. స్థానికులు గమనించి 108లో గుంటూరు వైద్యశాలకు పంపగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెనాలి జీఆర్పీ ఎస్ఐ జి.వెంకటాద్రి తెలిపారు.

వినికిడి సమస్యలపై అవగాహన



తెనాలి: ది తెనాలి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జులై నెల సమావేశం శనివారం సాయంత్రం చెంచుపేటలోని అమరావతి కాలనీలో గల ఎన్టీఆర్ కమ్యూనిటీ హాలులో జరిగింది. గుంటూరుకు చెందిన ఆడియోలజిస్ట్ బి.శ్రీనివాస్ వినికిడి సమస్యలపై సభ్యులకు పరీక్షలు చేసి తగిన సలహాలను ఇచ్చారు. జులై నెలలో జన్మించిన సభ్యులు కె.నాగేశ్వరరావు, ఎం.అర్జున్, కె.చంద్రమౌళి, ఎం.వీరశేఖరరావు, ఖాదర్‌బాష, వై.రమేష్‌బాబు, వి.వెంకటేశ్వర్లు, కేపీఎస్ రాజును సత్కరించారు. అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు, కార్యదర్శి కావూరి నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

పేదలకు అన్నదానం

తెనాలిఅర్బన్: గుంటూరు–2 మాజీ శాసన సభ్యుడు తాడిశెట్టి వెంకట్రావు జన్మదినాన్ని పురస్కరించుకుని బోయిన వాసు ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి వారి అన్నదాన కేంద్రంలో శనివారం పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే వెంకట్రావు జన్మదిన రోజు పేదలకు అన్నదానం చేయడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను, గ్యాలం సాయికృష్ణ, తాడిశెట్టి గోపి, సిహెచ్.శ్రీను పాల్గొన్నారు.

ల్యాభార్జనే ధ్యేయం!

- మంగళగిరి నియోజకవర్గంలో ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబ్‌ల నిర్వాహకుల ఇష్టారాజ్యం
- పలు రకాల పరీక్షల పేరుతో భారీగా వసూళ్లు
- పుట్టగొడుగుల్లా అనుమతి లేని ల్యాబ్‌లు, శ్యాంపిల్ కలెక్షన్ సెంటర్లు



తాడేపల్లి రూరల్: లాభార్జనే ధ్యేయంలా ల్యాబ్‌లు నడుపుతున్న నిర్వాహకులు రోగులకు ఉన్న వ్యాధి సంగతి అటుంచితే కొత్తవి అంటగడుతున్నారు. వీరి పొరపాట్ల కారణంగా రోగులు కొన్ని సందర్భాల్లో ప్రాణం మీదకు తెచ్చుకున్న సంఘటనలు లేకపోలేదు. పాథాలజీ, బయో కెమిస్ట్రీ, మైక్రో బయోలజీ నిపుణులు వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఫలితాలను ధ్రువీకరించాలి. కానీ అర్హత లేని వారు పరీక్షలు చేస్తున్నారు. కొందరు వైద్యులు, సిబ్బంది ల్యాబ్‌ల యాజమాన్యాలతో కుమ్మక్కై ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారనే విమర్శలు పెద్ద ఎత్తున వస్తున్నాయి.

రెట్టింపు చార్జీలు వసూలు

మంగళగిరి నియోజకవర్గ పరిధిలో ప్రైవేటు వైద్యులు, డయాగ్నోస్టిస్ సెంటర్లు, ల్యాబ్‌ల నిర్వాహకులు, రోగుల నుంచి అందిన కాడికి దోచుకుంటున్నారు. వైరల్ జ్వరాలతో ఆసుపత్రికి వెళ్లిన బాధితులకు మలేరియా, డెంగీ, టైఫాయిడ్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు చెబుతున్నారు. ఆసుపత్రిలో ల్యాబ్ లేకపోతే... ఫలానా ల్యాబ్‌కు వెళ్లాలని సిఫార్సు చేస్తున్నారు. ఇక ప్రైవేటు ల్యాబ్‌ల నిర్వాహకులు నిర్ణీత ఫీజుల కన్నా రెట్టింపు చార్జీలు వసూలు చేస్తున్నారు. వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు కనీస పర్యవేక్షణ, తనిఖీలు లేకపోవడంతో ప్రైవేటు వైద్యులు, ల్యాబ్‌లు, డయాగ్నోస్టిక్ కేంద్రాల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా రోగుల నుంచి డబ్బులు దండుకుంటున్నారు.

> **ధరల పట్టిక ఎక్కడ?**
>
> ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి వైద్య పరీక్షకు అయ్యే ఖర్చులకు సంబంధించి ల్యాబ్‌లో అందరికీ కనిపించేలా ధరల పట్టిక ఏర్పాటు చేయాలి. ల్యాబ్‌లో పనిచేసే అసిస్టెంట్, పెథాలజిస్ట్ ఫొటోతో ఉన్న విద్యార్హత ధ్రువపత్రాన్ని రిసెప్షన్ వద్ద ఏర్పాటు చేయాలి. కానీ ఏ ప్రైవేటు ఆసుపత్రుల్లో, ల్యాబ్‌లలో ఇవి కనిపించవు. కొంతమంది వైద్యులు ఆసుపత్రి ఏర్పాటుకు అనుమతి పొంది, అనుమతి లేకుండా ల్యాబ్‌లు నిర్వహిస్తున్నారు.

సెంటర్‌కో ల్యాబ్...

నియోజకవర్గంలో అధికారికంగా ల్యాబ్‌లు తక్కువే. అనధికారిక ల్యాబ్‌లు మాత్రం వందలాదిగా ఉన్నాయి. సెంటర్‌కో ల్యాబ్ దర్శనమిస్తుంది. ల్యాబ్‌లపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప అధికారులు స్పందించడం లేదు.

అర్హత లేని వ్యక్తులతో పరీక్షలు...

నియోజకవర్గంలో పలు ల్యాబ్‌లను పెథాలజిస్టులు లేకుండానే నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరికొన్ని ల్యాబ్‌లో కనీస అర్హతలు లేని వారిని నియమించుకుని పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఒక జ్వర బాధితుడు చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాడు. డెంగీ నిర్ధారణ పరీక్ష చేసి, రక్తంలో ప్లేట్‌లెట్లు 40 వేలకు పడిపోయాయని చెప్పారు. దీంతో అతని కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి వెంటనే సమీపంలోని మరో ల్యాబ్‌లో పరీక్షలు చేయించగా రక్తంలో ప్లేట్‌లెట్లు 1.20 లక్షలు ఉన్నట్లు రిపోర్టు ఇచ్చారు. దీంతో సదరు ఆసుపత్రి సిబ్బందితో బాధితుడి బంధువులు వాగ్వివాదానికి దిగారు.

రిఫర్ చేస్తే ఆఫర్...!

మంగళగిరి నియోజకవర్గంలో అనుమతులు లేని డయాగ్నోస్టిక్ సెంటర్లు, ల్యాబ్‌లు, ఆసుపత్రులు రెట్టింపు సంఖ్యలో ఉన్నాయి. వైద్యులు, ల్యాబ్‌ల నిర్వాహకులు కుమ్మక్కై అవసరం లేని వైద్యపరీక్షలు చేయిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ల్యాబ్‌ల నిర్వాహకులు పరీక్ష ఫీజు రూపంలో వసూలు చేసే సొమ్ములో 20 నుంచి 40 శాతం వరకు సంబంధిత వైద్యులకు కమీషన్‌గా అందజేస్తున్న విషయం బహిరంగ రహస్యమే.

వైఎస్సార్ విగ్రహానికి ముసుగు

- యర్రబాలెంలో దుందుడుగు చర్యకు పాల్పడిన టీడీపీ నేతలు
- ముసుగు తొలగించి, క్షీరాభిషేకం చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు



వైఎస్సార్ విగ్రహానికి ముసుగు తొలగించి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

యర్రబాలెం(మంగళగిరి): మంగళగిరి – తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని యర్రబాలెంలో దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి స్థానిక టీడీపీ నేతలు కొందరు ముసుగులు వేయడం స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలోని మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి శనివారం స్థానిక టీడీపీ జెడ్పీటీసీ ఆదేశాలతో కొందరు టీడీపీ నేతలు ముసుగులు వేశారు. విషయం తెలుసుకున్న వెంటనే వైఎస్సార్ సీపీ నాయకులు అక్కడికి చేరుకుని ముసుగు తొలగించి వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. మళ్లీ ఇటువంటి అనారిగ చర్యలు పునరావృతమైతే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి, ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత వైఎస్సార్ విగ్రహాలు ఉండటం సైతం టీడీపీ, జనసేన నేతలు ఓర్చుకోలేకపోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రోస్టేట్ సమస్యలపై అవగాహన ర్యాలీ



వాకథాన్‌లో పాల్గొన్న వైద్యులు సిబ్బంది

మంగళగిరి: ప్రోస్టేస్ సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో శనివారం ఉదయం ఎయిమ్స్ వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఎయిమ్స్ నుంచి సీకే కన్వెన్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సుజికాన్ -2025 ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ సీవీ సతీష్‌కుమార్, సెక్రటరీ డాక్టర్ ధీరజ్ కాసరనేనిలు మాట్లాడుతూ యూరాలజీ చికిత్స రంగంలో కీలక మైలురాయిగా సుజికాన్–2025 పనిచేస్తుందన్నారు. విజయవాడ అసోషియన్ ఆఫ్ జైనైటో యూరినరీ సర్జన్స్ ఆధ్వర్యంలో ప్రశాంత్ ఆసుపత్రి నిర్వాహణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ అమర్నాథ్ సింగ్, డాక్టర్ చెంగల్రాయన్ జెండా ఊపి ప్రారంభించారు.

ప్రోస్టేట్ సమస్యకు అందుబాటులో పలు ఆధునిక చికిత్సలు..

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 36వ సదరన్ యూరాలజిస్టల వార్షిక సదస్సు సుజికాన్ – 2025కు దేశవ్యాప్తంగా వెయ్యి మంది యూరాలజిస్టులు హాజరై తమ అభిప్రాయాలను పంచుకోవడం జరిగిందన్నారు. ప్రధాన యూరాలజికల్ సబ్ స్పెషాల్టిలో 50కి పైగా శాస్త్రీయ సెషన్‌లు నిర్వహిస్తున్నామన్నారు. మాస్టర్ క్లాస్‌లతో పాటు ఆచరణాత్మక అభ్యాసంతో సహా 8 కేంద్రీకృత ఉపస్పెషాలిటీ సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సంబంధిత సమస్యలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలనే లక్ష్యంతో వాకథాన్ నిర్వహించామని తెలిపారు. ప్రోస్టేట్ సమస్యలపై పలు ఆధునిక చికిత్సలు అందుబాటులో వున్నాయన్నారు. నవీన చికిత్స విధానాలు, సాంకేతిక సంపత్తి ద్వారా మెరుగైన ఫలితాలను సాధించగలుగుతున్నామన్నారు. ప్రశాంత్ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ ప్రశాంత్ కాసరనేని, కోశాధికారి డాక్టర్ అజయ్‌కుమార్, సైంటిఫిక్ కమిటీ ఇన్‌ఛార్జి డాక్టర్ పి.శ్రీమన్నారాయణ, సోగస్ ఏపీ, తెలంగాణ కార్యదర్శి డాక్టర్ జి.శ్రీనివాసరావు, వాగస్ అధ్యక్షుడు డాక్టర్ జి.రవి శంకర్, సుజకాన్ 2025 చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు బిగిస్తే అడ్డుకోండి

ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేసిన పౌర సంక్షేమ సంఘం నాయకులు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న పౌర సంక్షేమ సంఘం నాయకులు

తాడేపల్లి రూరల్: స్మార్ట్ మీటర్లు బిగిస్తే అడ్డుకోవాలని వివరిస్తూ పౌర సంక్షేమ సంఘం నాయకులు బూరగ వెంకటేశ్వర్లు, డి.వి. భాస్కర రెడ్డి శనివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ముగ్గ రోడ్డు, బోసుబొమ్మ సెంటర్లలో కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వున్న విద్యుత్ మీటర్ల స్థానంలో అదానీ కంపెనీ స్మార్ట్ మీటర్ బిగించి ప్రజలపై భారాలు వేయడానికి కూటమి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. ఇంటి పన్నులు కూడా 15 శాతం పెంచబోతున్నారని, ఇంటిపన్ను పెంచేందుకు కొలతలు వేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలని సూచించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రస్తుతం ఆస్తి విలువ ఆధారిత పన్ను వేయాలని ఆదేశించిందని, వీటికి వ్యతిరేకంగా పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. నాయకులు దర్శనపు విజయ్ బాబు, కె.మేరి, కోట బాబూరావు, ఫిరోజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు దళిత ఓపెన్ యూనివర్సిటీ స్నాతకోత్సవం



మాట్లాడుతున్న వెడ్స్ సంస్థ డైరెక్టర్ ఎం.స్వర్ణలతా దేవి

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని దీనాపూర్ కళాశాల ఆవరణలో దళిత ఓపెన్ యూనివర్సిటీ స్నాతకోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్లు వెడ్స్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ స్వర్ణలతాదేవి చెప్పారు. కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ డాక్టర్ పుల్లగూర రంజన్‌బాబు 1979లో సమాజ మరియు గ్రామీణాభివృద్ధి సంస్థను స్థాపించారన్నారు. ఈసంస్థ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద, బలహీన వర్గాల జీవితాల్లో అనేక మార్పులు తీసుకొచ్చినట్లు తెలిపారు. 1986లో దళిత ఓపెన్ యూనివర్సిటీని స్థాపించి దానిద్వారా చరిత్ర, కల్చర్, స్టడీస్, దళిత ఉమెన్, యువత, లీగల్ స్టడీస్ వంటి అనేక రకాలు కోర్సులు ప్రవేశపెట్టి విద్యార్థులను ఉన్నతస్థానంలోకి నడిపిస్తున్నామని చెప్పారు. ప్రతి ఏటా దేశంలోని వివిధ విభాగాలకు చెందిన ఐదుగురిని ఎంపికచేసి వారికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేషనల్ అవార్డులు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్ప్స్ సంస్థ చైర్మన్ ఫ్రాంక్ విశ్వనాథ్ పాల్గొంటారన్నారు. డిప్యూటీ డైరెక్టర్ అమర్‌నాథ్, కార్ప్స్ డైరెక్టర్ కె.మేరి, కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ సుదర్శన్ పాల్గొన్నారు.

రాజధాని నిర్మాణ పనుల్లో ప్రమాదాల నివారణకు చర్యలు

కాంట్రాక్టర్లకు ఏడీసీ సీఎండీ ఆదేశాలు



పరిశీలిస్తున్న ఏడీసీ సీఎండీ డి.లక్ష్మీ పార్థసారథి

తాడికొండ: రాజధాని నిర్మాణ పనుల్లో పనిచేస్తున్న కార్మికులు, సాధారణ ప్రజలకు ఎలాంటి ప్రమాదకర పరిస్థితులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అమరావతి అభివృద్ధి సంస్థ చైర్ పర్సన్ డి.లక్ష్మీ పార్థసారథి కాంట్రాక్టర్లను ఆదేశించారు. శనివారం ఆర్‌వీఆర్ సంస్థ చేపడుతున్న ఎన్–14, ఈ–8, ఈ–6, ఎన్–7,10,11 రహదారుల నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. తొలుత ఆర్‌వీఆర్ క్యాంపును పరిశీలించి ప్రపంచ బ్యాంకు నిబంధనలు పాటిస్తూ కార్మికులకు ఆహారం వసతి సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. రహదారుల నిర్మాణ ప్రదేశాలలో ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ మేజర్స్‌ను క్షేత్రస్థాయిలో పర్యటించి తనిఖీ చేశారు. ఎలాంటి ప్రమాదాలు వాటిల్లకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, నీటి కుంటలు, నిర్మాణ తవ్వకాల వద్ద రేడియం స్టిక్కర్లతో కూడిన హార్డ్ బ్యారికేడింగ్‌లు చేయాలన్నారు. వర్షాకాలంలో చేపట్టాల్సిన పనులను వేగవంతం చేయాలని గుత్తేదారు సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఏడీసీ చీఫ్ ఇంజినీర్ ఆర్.గోపాల కృష్ణారెడ్డి, ఎస్ఈలు నరసింహమూర్తి, నరసింహారావు, వి.శ్రీనివాస్, ఈఈలు బసవేశ్వరరావు, రమేష్, వైకుంఠరావు ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవం.. భూ వరాహస్వామి కల్యాణం



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు



కల్యాణ తంతు జరిపిస్తున్న శ్రీశ్రీశ్రీ త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై శనివారం భూ వరాహస్వామి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ పరమహంస పరివ్రాజకులు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళ శాసనాలతో శ్రీశ్రీశ్రీ త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో శ్రీ భూ వరాహ స్వామి అభిషేక మహోత్సవాన్ని ఉదయం 9 గంటలకు, అనంతరం శ్రీ భూ వరాహస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించామని తెలిపారు. భక్తులకు శ్రీశ్రీశ్రీ త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి అనుగ్రహ భాష్యం ఇచ్చారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారని ఆయన తెలిపారు.

డెంగీ, మలేరియాపై అవగాహన



డెంగీ, మలేరియాపై అవగాహన కల్పిస్తున్న సుధీర్ కుమార్, ఆరోగ్య సిబ్బంది

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సాయిబాబా గుడి ఎదురుగా పేదల నివాసాల్లో మలేరియా సబ్ యూనిట్ అధికారి సుధీర్‌కుమార్ ఆధ్వర్యంలో డెంగీ, మలేరియాలపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగీ, మలేరియా, చికున్ గున్యా, మెదడు వాపు వ్యాధులు వ్యాపించడానికి దోమలే ముఖ్య కారణమన్నారు. జ్వరం, నొప్పులు, నీరసం, వాంతులు, అపస్మారక స్థితికి చేరడం డెంగీ వ్యాధి లక్షణాలని, వెంటనే ప్రభుత్వ వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రతి ఒక్కరు దోమతెరలు వాడాలని, నీటి నిల్వలు లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. మలేరియా సూపర్‌వైజర్ శివశంకరరావు, హెల్త్ అసిస్టెంట్ జయరాజు, ఆశా కార్యకర్త రేణుక, ఎస్‌జీటీ టీచర్ ఆశ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను నిత్యం తనిఖీ చేస్తున్నాం

జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుక

సాక్షి ఎఫెక్ట్

తాడేపల్లి రూరల్: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల చిన్నారులు అధిక బరువులు గల పుస్తక బ్యాగులు మోసుకెళుతూ... తీవ్ర ఇబ్బందులు పడుతున్న వైనంపై 'బరువుకు మించిన బడిసంచి' శీర్షికన ఈనెల 10వ తేదీన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా విద్యాశాఖాధికారి సి.వి.రేణుక స్పందించి, శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యాశాఖ నిబంధనల ప్రకారం కాకుండా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో కాపీబుక్స్ పేరుతో పిల్లలకు ఎక్కువ పుస్తకాలను ఇస్తే.. దీనిపై ఎవరైనా తల్లిదండ్రులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే ఆ పాఠశాలలపై చర్యలు తీసకుంటామని, నిత్యం అన్ని పాఠశాలలను విద్యాశాఖ సిబ్బంది తనిఖీలు చేస్తున్నారని ఆమె ప్రకటనలో తెలిపారు.

వాహనం ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు మృతి



తాడికొండ: గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన తాడికొండ అడ్డరోడ్డులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గత నెల 22వ తేదీన తాడికొండ అడ్డరోడ్డులో గుర్తుతెలియని వృద్ధుడు రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనంతో ఢీకొని పరారీ అయ్యాడు. గాయాలపాలైన వృద్ధుడిని స్థానికుల సాయంతో జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స అందిస్తుండగా ఈ నెల 8వ తేదీన మరణించాడు. తాడికొండ వీఆర్వో రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 60 సంవత్సరాల వృద్ధుడు మరణించి మార్చురీలో మృతదేహాన్ని భద్రపరిచినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె వాసు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ముగిసిన టౌన్‌చర్చి శతవార్షిక మహోత్సవాలు

చివరిరోజున 15 వేలమందికి 'ప్రేమవిందు'



ఐఆర్ఎస్ అధికారి పి.ఆనంద్‌కుమార్‌కు జ్ఞాపిక అందిస్తున్న నిర్వాహకులు

తెనాలి: ఆంధ్ర ఇవాంజెలికల్ లూథరన్ చర్చి (ఏఈఎల్‌సీ) తూర్పు గుంటూరు సినడు పరిధిలో తెనాలిలో గల క్రీస్తు దేవాలయం (టౌన్‌చర్చి) శతవార్షిక మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఉదయం కీర్తనలతో చివరిరోజైన శనివారం వేడుకలను ఆరంభించారు. టౌన్‌చర్చి ప్యారిష్ పాస్టరు రెవరెండ్ దేవరపల్లి ఏసురత్నం, అడిషనల్ పాస్టర్లు యామర్తి లెనిన్ బాబు, దగ్గుమల్లి సాల్మన్‌రాజు, మత్తె విజయభాస్కర్ ప్రకాష్‌బాబు ఆరాధన జరిపారు. చల్లాపల్లి ఫ్రాన్సిస్ జేవియర్ బైబిల్ పాఠం, గురిందపల్లి వేమయ్య సువార్త పాఠం చదివారు. దగ్గుమల్లి ఏలియా కుమారి సాల్మన్ ప్రార్థన చేశారు. తదుపరి చెన్నైలోని గురుకుల్ లూథరన్ థియోలాజికల్ కాలేజీ ప్రొఫెసర్ రెవ.డాక్టర్ దాయం జోసెఫ్ ప్రభాకర్ వాక్యసందేశమిచ్చారు. అనంతరం వాక్యోపదేశకులు, అతిథులు, స్థానిక సంఘకాపరులను సత్కరించారు. సత్కార గ్రహీతల్లో రాష్ట్ర జీఎస్టీ కమిషనర్ (ఆడిట్) పి.ఆనందకుమార్ ఉన్నారు. మధ్యాహ్నం నాజరుపేటలోని లూథరన్ అప్పర్ ప్రైమరీ స్కూలు మైదానంలో శతవార్షిక ప్రేమ విందును ఏర్పాటుచేశారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్నుంచి పెద్దసంఖ్యలో క్రైస్తవులు, క్రైస్తవేతరులు 15 వేల మందికిపైగా హాజరయ్యారు. శతవార్షిక ఉత్సవాల కన్వీనర్ పిల్లి పాల్ రవీంద్ర విద్యాసాగర్, కో-ఆర్డినేటర్ పిల్లి సుధాకరరావు, ప్యారిష్ పాస్టర్, అడిషనల్ పాస్టర్లతోపాటు అడ్‌హాక్ కమిటీ సభ్యులు ఐనంపూడి డేవిడ్‌రాజు, డాక్టర్ శ్యాంప్రకాశరావు గారపాటి, చల్లాపల్లి ఫ్రాన్సిస్ జేవియర్, సుదర్శనం జాన్‌మోహన్, చెరుకూరి సునీల్‌కుమార్, కారుమంచి చంద్రకుమార్, గ్లె దేవదానం, గురిందపల్లి వేమయ్య, కొమ్మెర్ల అంబేడ్కర్, బేతాళ కిషోర్‌బాబు, బడుగు బుజ్జిబాబు, నక్కా కృపాసాగర్, జొన్నకూటి శ్యామ్‌కుమార్, గేరా రాజు, వివిధ కమిటీల నాయకులు పర్యవేక్షించారు.



శత వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రేమ విందులో పాల్గొన్న స్థానికులు

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

పట్నంబజారు: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగకుంటే పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని లాలాపేట పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఎ.వి.శివప్రసాద్ హెచ్చరించారు. శనివారం లాలాపేట పీఎస్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌హెచ్‌ఓ శివప్రసాద్ మాట్లాడుతూ ఎటువంటి ఘర్షణలు, అసాంఘిక కార్యకలాపాలకు రౌడీషీటర్లు పాల్పడ్డారని తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మంచి భవిష్యత్ కోసం చక్కటి ప్రవర్తనతో వ్యవహరించాలని సూచించారు. స్థానికుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

లీటరు పాలకు రూ.10 బోనస్ ఇవ్వాలి

తెనాలి: లీటరు పాలకు రూ.10 బోనస్‌గా ఇవ్వాలని 70 శాతం సబ్సిడీపై దాణామేత విత్తనాలు సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణ అయితానగర్‌లోని ఎర్రబడి సెంటరులో శనివారం జరిగిన పాల రైతుల సమావేశానికి వేజెండ్ల తబిత అధ్యక్షత వహించారు. శివసాంబిరెడ్డి మాట్లాడుతూ పాడి పంట రైతులకు రెండు కళ్లలాంటివని, ఒకటి దెబ్బతిన్నా మరొకదానిలోనైనా కుటుంబాన్ని పోషించుకోవచ్చన్న భరోసా గతంలో ఉండేదన్నారు. కేరళ, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు పాడి రైతులకు రూ.5–8లు బోనస్ గా ఇస్తూ ఆదుకుంటున్నాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం పాల రైతులను పట్టించుకోవటం లేదని మండి పడ్డారు. ప్రతి పాడి రైతుకు, డైరీ ఫాం నడుపుతు న్న రైతులకు లీటరుకు పది రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూచిపూడి శకుంతలను అధ్యక్షురాలుగా వేజెండ్ల తబితను కార్యదర్శిగా, మాన్యం పద్మ ఉపాధ్యక్షురాలుగా, తెనాలి నిర్మల సహాయ కార్యదర్శిగా, ఎలమాటి మీరిమ్మ కోశాధికారిగాత నూతన కమిటీని ఎన్నుకున్నారు.